ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

# ప్రాంతీయ వార్తలు

తేది : 26 -01-2026 సమయం : 1.20 గంటలు

## ముఖ్యాంశాలు

1. **గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని కర్తవ్యపథ్ లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము జాతీయ జెండాను ఆవిష్కరించారు.**
2. **2047 నాటికి ప్రపంచంతో పోటీ పడే రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను రూపొందించడమే లక్ష్యమని గవర్నర్ జస్టిస్  ఎస్. అబ్దుల్ నజీర్ తెలిపారు.**
3. **తెలుగు రాష్ట్రాల నుంచి పద్మ అవార్డులకు పలువురు ఎంపిక కావడం పట్ల కేంద్ర, బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.**
4. **విద్య, ఆరోగ్యం, సంక్షేమాలకు  పట్ల ప్రభుత్వం కృషి చేస్తోందని  రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి అన్నారు.**
5. **విశాఖపట్నం వేదికగా భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య నాలుగో టీ20క్రికెట్ మ్యాచ్  ఈనెల 28న జరగనుంది.**

----------------------

దేశవ్యాప్తంగా 77వ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. దేశ రాజధాని ఢిల్లీ నుంచి మారుమూల గ్రామాల వరకు త్రివర్ణ పతాకం రెపరెపలాడుతోంది. ఈ ఏడాది గణతంత్ర వేడుకలను 'వందే మాతరం – 150 సంవత్సరాలు' అనే ఇతివృత్తంతో నిర్వహిస్తున్నారు. ఢిల్లీలోని కర్తవ్యపథ్ లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము జాతీయ జెండాను ఆవిష్కరించి . సైనిక బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్   ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ వేడుకల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ కేంద్ర మంత్రులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ప్రదర్శించిన వివిధ రాష్ట్రాల శకటాలు ఆకట్టుకున్నాయి.

----------------------

రాష్ట్ర వ్యాప్తంగా గణతంత్ర వేడుకలను ఈ రోజు ఘనంగా నిర్వహిస్తున్నారు. అమరావతిలో గవర్నర్ జస్టిస్  ఎస్. అబ్దుల్ నజీర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్  పలువురు మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా  గవర్నర్ మాట్లాడుతూ.. సాంకేతికత ద్వారా క్షణాల్లో పాలన ప్రజలకు చేరేలా వ్యవస్థను తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. 2047 నాటికి ప్రపంచంతో పోటీ పడే రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను రూపొందించడమే లక్ష్యమని గవర్నర్ పేర్కొంటూ..

వాయిస్... 36

గుంటూరు జిల్లా ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో  జరిగిన

వేడుకల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అమరావతి లోని రాష్ట్ర సచివాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, విజయవాడ రైల్వే మినీ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో రైల్వే డివిజన్ అడిషనల్ మేనేజర్ పాల్ ఎడ్విన్ జాతీయ జెండాలను ఆవిష్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జిల్లా కేంద్రాల్లో కలెక్టర్లు, ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

----------------------

తెలుగు రాష్ట్రాల నుంచి పద్మ అవార్డులకు పలువురు ఎంపిక కావడం పట్ల కేంద్ర, బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన సామాజిక మధ్యమం  ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ఆయా రంగాల్లో వీరు చేసిన కృషి.. భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని కేంద్రమంత్రి ఆకాంక్షించారు.

----------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2015లో ప్రారంభించిన ప్రో–యాక్టివ్ గవర్నెన్స్ అండ్ టైమ్‌లీ ఇంప్లిమెంటేషన్ -PRAGATI వేదిక 50వ సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించింది. కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల పురోగతిని పర్యవేక్షించడం, జాప్యాలకు కారణమైన సమస్యలను నేరుగా ప్రధానమంత్రి స్థాయిలో సమీక్షించి పరిష్కరించే ఈ డిజిటల్ వేదిక పాలనలో గణనీయమైన మార్పు తీసుకొచ్చింది. కేంద్రం, రాష్ట్రాలు, కేంద్ర మంత్రిత్వ శాఖలు ఒకే వేదికపై కలిసి పనిచేసే సహకార వ్యవస్థకు ప్రగతి ప్రతీకగా నిలిచింది. మహారాష్ట్రలోని నెరుల్–బెలాపూర్–ఉరణ్ రైల్వే లైన్ ప్రాజెక్ట్ ప్రగతి విజయానికి ఉదాహరణగా నిలిచింది. రైల్వే మంత్రిత్వ శాఖ

ఆధ్వర్యంలో 2వేల 8 వందల  కోట్లరూపాయలకు పైగా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్ట్ రెండు దశల్లో పూర్తి అయింది.  అటవీ అనుమతులు, భూసేకరణ వంటి సవాళ్లను ప్రగతి సమీక్షల ద్వారా పరిష్కారమయ్యాయి.  తొలి దశను 2018లో ప్రారంభించగా, ఖార్కోపర్–ఉరణ్ రెండో దశను 2024 జనవరి 12న ప్రధాని మోదీ ప్రారంభించారు.

-----------------------

పేద విద్యార్థుల విద్య, ఆరోగ్యం, సంక్షే పట్ల ప్రభుత్వం కృషి చేస్తోందని  రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. విశాఖపట్నంలోని సీతమ్మదార సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని మంత్రి నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి హాస్టల్ లో మెనూ వివరాలు, వసతులు, సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

-----------------------

విశాఖపట్నంలో  నిర్వహిస్తున్న 'విశాఖ ఉత్సవ్-2026' రెండో రోజు వేడుకలు అలరించాయి. 'సీ టు స్కై' థీమ్‌తో జరుగుతున్న ఈ ఉత్సవాల్లో భాగంగా నిన్న సాయంత్రం ఆర్కే బీచ్ రోడ్డులో బహుముఖ కార్యక్రమాలు నిర్వహించారు. గోకుల్ పార్క్ సమీపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై స్థానిక కళాకారులు తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. వచ్చే నెల  1వ తేదీన  అరకులో గ్రాండ్ ఫినాలేతో  ఈ ఉత్సవ్ ముగుస్తుంది.  ఈ క్రమంలో ఈనెల 29వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు  అరకు సందర్శించనున్నారని అధికారులు తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా  అరకులో పర్యాటక అభివృద్ధిపై సమీక్ష నిర్వహించనున్నారు.

-----------------------

అనంతపురం జిల్లాలో కరువు పరిస్థితుల మధ్య కూడా అక్కడి ప్రజలు, రైతులు నీటి సంరక్షణలో వినూత్న ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ప్రయత్నాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మన్ కీ బాత్ కార్యక్రమంలోనూ ప్రస్తావించారు. ప్రజల సహకారంతో 'అనంత నీరు సంరక్షణ' కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. ఇంకుడు గుంతల ద్వారా నీటి నిల్వ పెరిగి బోర్లు రీఛార్జ్ అయ్యాయని గుజరాత్ కు చెందిన సుశీల తెలుపుతూ..

వాయిస్ 28

----------------------

న్యూజిలాండ్ క్రికెట్ జట్టు భారత పర్యటనలో భాగంగా ఇరు జట్ల మధ్య నిర్వహిస్తున్న టి 20 సిరీస్ లో నాలుగో మ్యాచ్ ఈనెల 28వ తేదీన జరుగనుంది. విశాఖపట్నం వేదికగా రాత్రి 7 గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది.  ఐదు మ్యాచ్ ల సిరీస్ లో భాగంగా ఇప్పటికే నిర్వహించిన మూడు మ్యాచ్ లలో భారత్ విజయం సాధించి 3-0 ఆధిక్యంతో సిరీస్ కైవసం చేసుకుంది.

----------------------

ఆంధ్రప్రదేశ్ యానాంలలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య, తూర్పు దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.  వీటి ఫలితంగా రాష్ట్రంలోని కోస్తా, యానాంలో,పొడి వాతావరణం ఏర్పడే  అవకాశం ఉండగా రాయలసీమల్లో ఈ రోజు, రేపు ఒకటి రెండు చోట్ల తెలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని  వాతావరణ కేంద్ర అధికారి ఎం. వెంకట్రావు తెలియజేస్తూ..

వాయిస్ 20

----------------------